క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం బేడా సేవ, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, యాగశాలార్చన, ధ్వజారోహణం, నిత్య పూర్ణాహుతి, పల్లకి సేవ తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని, గురువారం పుష్పార్చన ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు అధిక ప్యాకేజీతో ఉద్యోగాలు

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ విజయవాడలో నిర్వహించిన సెంట్రల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు అత్యధిక వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించి రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయంలో టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీ నిర్వహించిన డ్రైవ్‌లో ఈ కాలేజీ నుంచి ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు చెప్పారు. ఈ కాలేజీలో ఈఈఈ విభాగానికి చెందిన కె.నాగదుర్గ, జి.సుధీర్ కుమార్, వి.త్రిశాంత్ కుమార్‌ను రూ.9.02 లక్షల వార్షిక జీతంతో కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసింది. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంత పెద్ద మొత్తంలో వార్షిక జీతం లభించడం రికార్డుగా చెప్పుకో వచ్చు. ఈ సెంట్రల్ డ్రైవ్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచి 900 మంది విద్యార్థులు నమోదు చేసు కోగా వారిలో 98 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు షార్ట్‌లిస్ట్ చేశారు. వీరిలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి 14 మంది చివరి రౌండ్‌కు చేరుకోగా, ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు.

రగ్గులు పంపిణీ

ఆరిలోవ : తోటగరువు దరి జీవీఎంసీ సామాజిక భవనంలో మంగళవారం మదర్ థెరిస్సా ఎవర్‌గ్రీన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం పండగ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సెవెన్ హిల్స్ హెచ్‌ఆర్ విభాగం ప్రతినిధి భాను పాల్గొని 130 మంది దివ్యాంగులు, అంధులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ప్రసాదరావు, తాతబాబు, జయ పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెయిన్‌కు మోక్షం



ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటెయిన్

బీచ్‌రోడ్డు : ప్రారంభించిన మూడు రోజులకే మూలకు చేరిన వాటర్ ఫౌంటెయిన్‌కు జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు మోక్షం ప్రసాదించారు. జీవీఎంసీ 20వ వార్డులోని మానసిక ఆస్పత్రి జంక్షన్‌లో ఆరు నెలల కిందట ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ ప్రారంభించిన మూడు రోజులకే పని చేయడం ఆగిపోయింది. మరలా జీవీఎంసీ అధికారులు దానిపై దృష్టి సారించకపోవడంతో ఇన్నాళ్లూ అలానే ఉండిపోయింది. ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టడంతో ఆ జంక్షన్ రాత్రి సమయంలో ఎంతో సుందరంగా కనిపిస్తోంది.

పార్కులోని చెత్త తొలగింపు



చెట్ల కొమ్మలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–3 ధర్మశక్తి నగర్‌లోని షిరిడీ సాయి పార్క్‌ను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది బుధవారం శుభ్రపరిచారు. కొంతకాలంగా పార్క్‌లో నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో చెట్లు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. దీంతోపాటు చెత్త పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. ఈ సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ పారిశుధ్య, బ్యూటిఫికేషన్ సిబ్బంది పార్కును బుధవారం శుభ్రం చేశారు. చెట్ల కొమ్మలు తొలగించడంతోపాటు పేరుకుపోయిన చెత్తను తరలించారు. పార్క్‌ను శుభ్ర పరచి అందుబాటులోకి తేవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు దారేది?



రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణ సామగ్రి

- అసలే ఇరుకు రోడ్లు
- ఆపై నిర్మాణ సామగ్రి
- దారి లేక కాలనీ వాసుల అవస్థలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు



పిఠాపురం కాలనీలో రోడ్డుపై అడ్డుగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

మద్దిలపాలెం: రహదారిపై రాకపోకలకు వీల్లేకుండా భవన నిర్మాణదారులు ఇష్టానుసారం నిర్మాణసామగ్రి వేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో అన్ని రోడ్లు ఇరుకుగా ఉంటాయి. ఆయా రోడ్లపై ద్విచక్ర, ఇతర చిన్న వాహనాల రాకపోకలకు మాత్రమే వీలుంటుంది. భవన నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో అలాంటి ఇరుకు రోడ్లపై ఇసుక, ఇటుకలు, రాళ్లపిక్కలు కుప్పలుగా వేసి వది లేస్తున్నారు. దీంతో పాదచారుల సైతం రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఇక ద్విచక్రవాహనదారులు పరిస్థితి మరీ దారుణం. రోడ్లకు అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి ఉండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

22వ వార్డులో..

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో కళాభారతి వెనుక, ఎదురుగా ఉన్న కాలనీల్లో ముమ్మరంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయా భవన నిర్మాణ ప్రాంతాల్లో రోడ్లపై కుప్పలుగా ఇసుక, రాళ్ల పిక్కలు వేసి వదిలేస్తున్నారు. దీంతోపాటు సెంట్రింగ్, శ్లాబ్‌లకు వాడే చెక్కలు పడేస్తున్నారు. ఈ చెక్కలకు మేకులు ఉండటంతో, ఏమాత్రం ఆ చెక్కలపై నుంచి వాహనం వెళ్లినా టైర్లు పంక్చర్ అవుతున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

భవన నిర్మాణాల కోసం రోడ్డుపైనే కుప్పలుగా నిర్మాణ సామగ్రి వేస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తీరుపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో చిన్న తోపుడు బండి పెట్టినా వెంటనే వ్యానుల్లో పది మంది సిబ్బంది వచ్చి ఆ తోపుడు బండి తీసేవరకు ఊరుకోరని, మరి భవన నిర్మాణదారులపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని, వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రితో చాలా ఇబ్బంది పడుతున్నాం. టౌన్‌ప్లానింగ్ అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోకపోతే ఎలా? ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. మా ఇబ్బందులు తొలగించాలి.

– ఎం.ఎస్.కృష్ణ, పిఠాపురం కాలనీ

చాలా ఇబ్బంది పడుతున్నాం

చిన్నరోడ్డుపై అంత సామగ్రి వేస్తే ఎలా వెళ్తాం? ఆలోచించాలి కదా. కనీసం నడిచి వెళ్లాలన్నా కష్టమవుతోంది. రోడ్డుపై రాకపోకలకు వీల్లేకుండా సామగ్రి వేసేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలనీవాసుల ఇబ్బంది లేకుండా చూడాలి.

– ఎస్.మోహన్‌రావు, మద్దిలపాలెం

సముద్ర జలాల పరిరక్షణపై దృష్టి సారించాలి

ఎంవీపీ కాలనీ : సముద్ర జలాల పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఏపీ సముద్ర జీవుల పరిరక్షణ ప్రతినిధి హాని సెల్లాజ్ పేర్కొన్నారు. ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో సముద్ర జలాల పరిక్షణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో సముద్రాన్ని అందరూ ఒక చెత్త కుండీలా భావిస్తున్నారన్నారు. మానవ ఆధారిత వ్యర్థాలన్నీ ఇష్టారాజ్యంగా సముద్రంలో వదిలేస్తున్నారన్నారు. దీంతో సముద్ర జలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను జెల్లీ ఫిష్‌లు అనుకొని తాబేళ్లు, చేపలు తినడంతో మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, గ్రీన్ క్లైమేట్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ టి.ఐ.సి పాయింట్ వద్ద అద్దె ఇంట్లో నివసిస్తున్న ముచ్చు శ్రీనివాసరావు (33) మద్యానికి బానిసయ్యాడు. ఆయన ప్లంబింగ్ వర్క్ చేస్తుండగా, భార్య లావణ్య ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. బుధవారం ఉదయం 5 గంటలకు ఆమె డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి తలుపు కొట్టినా ఎంత సేపటికీ తీయలేదు. దీంతో స్థానికుల సహకారంతో ఇంటి వెనుక నుంచి వెళ్లి తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే ఆరిలోవ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. టి.ఐ.సి పాయింట్‌కు సమీపంలో నివసిస్తున్న మృతుడి తల్లిదండ్రులు ముచ్చు వెంకటలక్ష్మి, శంకరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, 4 సంవత్సరాల పాప ఉన్నారు.

కేజీహెచ్‌లో పటిష్ట భద్రతా చర్యలు

- ఆక్సిజన్ ప్లాంట్ పైపుల కోసివేతతో అప్రమత్తం



ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఒక రౌడీషీటర్ మద్యం తాగేందుకు డబ్బుల కోసం ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఉన్న పైపులను కోసిన ఘటన నేపథ్యంలో ఆస్పత్రి వైద్యవర్గాలు అప్రమత్తమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఆధ్వర్యంలో డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీలత సీఎస్ఆర్ బ్లాక్ వద్ద ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను తనిఖీ చేశారు. బయట వ్యక్తులు లోపలికి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు, ప్లాంట్ వాల్వు వద్ద కూడా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు తీసుకునే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ వద్ద వాల్వు భవిష్యత్తులో కోతకు గురి కాకుండా ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు పైపులైన్ల సంరక్షణకు కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం క్యాజువాల్టీ వద్ద ఉన్న అవుట్ పోస్టుతో పాటు, మరో అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశామని సూపరింటెండెంట్ వివరించారు. ఆస్పత్రిలో రాత్రిళ్లు మరింత మంది సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాంది ఫౌండేషన్ వితరణ



ఫౌండేషన్ పంపిణీ చేసిన స్పోర్ట్స్ బ్యాగులతో విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నాంది ఫౌండేషన్ బుధవారం స్పోర్ట్స్ బ్యాగులు పంపిణీ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయిని భవాని, ఉపాధ్యాయులతో కలసి ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు ఈ బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు భాను దివ్య, సత్యవతి, జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో 204 మందికి స్పోర్ట్స్ బ్యాగులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు చింతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా రాజశ్యామల హోమం



రాజశ్యామల హోమంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట : శ్రీలలితా పీఠంలో రాజశ్యామల నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పీఠంలో రాజశ్యామల హోమం ఘనంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తకంగా హోమం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హోమం చేయించుకున్నారు. ముందుగా మణిద్వీపంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, సహస్రనామార్చన, అలంకరణ చేశారు. శుక్రవారంతో నవరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణశేస్ తెలిపారు. ఈ నెల 9 నుంచి 12 వరకు శ్రీలలితాపీఠం 76వ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా 10న సాయంత్రం లలితా కామేశ్వరుల కల్యాణం జరిపిస్తామని తెలిపారు.

ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో ఆరా



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : స్వర్ణభారతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో ఉండే హరిజన వీధి సచివాలయాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఓపీ, ఐపీ, డయాగ్నొస్టిక్ సేవలు, మందుల లభ్యత, ఎన్‌సీడీ 3.0 సర్వే తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెడికల్ అధికారులు, సిబ్బందికి కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలపై పూర్తిగా విశదీకరించారు. అభ ఐడీ, మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రవిశంకర్, పలు విభాగాల అధికారులు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఏకాగ్రత ముఖ్యం



డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్స్ ఫ్యామిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవర్స్ విధి విధానాలు, కుటుంబ సమస్యలు ఫ్యామిలీ సభ్యులతో చర్చించారు. వారి శ్రేయస్సు, ఏకాగ్రత, ఎటువంటి సమస్యలు లేకుండా ఏ రకంగా ఉండాలో డ్రైవర్లకు సూచనలు చేశారు. డ్రైవర్ ఉద్యోగం చాలా క్లిష్టమైనదని, డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సు నడపాలని సూచించారు. కుటుంబ సమస్యలు ఏమైనా ఉంటే అసిస్టెంట్ మేనేజర్, డిపో మేనేజర్‌కు తెలిపి, వారి సహాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్మన్ అశ్విని, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవితాగానం చేస్తున్న కవి చిన సూర్యనారాయణ

సీతంపేట : సహృదయసాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కవి సమ్మేళనం వైవిధ్య భరితమైన కవితలతో అందరినీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వానికి వస్తువు, అభివ్యక్తి రెండూ ముఖ్యమని, అలంకారం కావ్య సౌందర్యానికి శోభినిస్తుందన్నారు. భావాన్ని స్పష్టంగా, చమత్కారంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని, కవి సమాజ శ్రేయోభిలాషి అన్నారు. ఈ సందర్భంగా నటుడు, నాటకకర్త రావి కొండలరావు సాహిత్య విశేషాలను వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కవిత్వంలోని విశేషాలు, ప్రముఖ కవుల రచనలు విశ్లేషించారు. అనంతరం రచయితలు చినసూర్యనారాయణ, కుమార్‌రావు, పరమేశ్వరరావు, వి.ఆర్.రావు, కె.వి.రామారావు, జగదీశ్వరరావు కవితలు చదివి వినిపించారు.

విమ్స్‌కు కేంద్ర మాజీ ఉద్యోగుల వితరణ



కేంద్ర మాజీ ఉద్యోగులు అందజేసిన దంత వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)కు జిల్లాలో కేంద్ర మాజీ ఉద్యోగుల అసోసియేషన్ దంత వైద్య పరికరాలను అందజేసింది. ఆ పరికరాలను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు దంత వైద్యులతో కలసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు రూ.6 లక్షల విలువ చేసే డెంటల్ చైర్స్, ఇతర ఆధునిక దంత వైద్య పరికరాలను అందించిన కేంద్ర మాజీ ఉద్యోగుల అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విమ్స్‌లో ఐదుగురు దంత వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఇక్కడ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దంత సమస్యలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పిల్లల దంత వైద్యంతో పాటు ఆర్థోపెడిక్ దంత వైద్యం అందిస్తున్నామన్నారు.

నీడ భవనంలోకి వెల్‌నెస్ సెంటర్–2

డాబాగార్డెన్స్‌లో ఉన్న వెల్‌నెస్ సెంటర్–2ను విమ్స్ ఆవరణలో ఉన్న నీడ భవనంలోకి త్వరలో తీసుకురానున్నట్లు డైరెక్టర్ తెలిపారు. ఇక్కడ సీజీహెచ్ఎస్ లబ్ధిదారులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగరంలోని రెండు వెల్‌నెస్ సెంటర్ల ఇన్‌చార్జ్‌లు డాక్టర్ సుభాని, డాక్టర్ శ్యామ్ కిషోర్ బాబు, ఆర్ఎంవో డాక్టర్ శిరీష, అసోసియేషన్ ప్రతినిధులు రవిబాబు, బి.డి.రాజు, ఎంఆర్‌డీ రాజు, కేవీడీ స్వామి, విమ్స్ దంత వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి గాయాలతో దృష్టిపై ప్రభావం



కంటి గాయాలపై అవగాహన కల్పిస్తున్న ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాలలో వైద్యులు బుధవారం రోగులకు కంటి గాయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ మాట్లాడుతూ కంటిపై ఎంత చిన్న గాయమైనా దృష్టిపై ప్రభావం చూపుతుందన్నారు. ఏవైనా పనులు చేస్తున్నప్పుడు, పిల్లలు ఆటలు ఆడుతున్న సమయంలో కొన్నిసార్లు కంటిపై గీతలు పడటం, గాయాలు కావడం జరుగుతుందన్నారు. అలాంటి సమయంలో కళ్లజోడు వాడాలన్నారు. చిన్న కంటి గాయం కూడా దీర్ఘకాలిక కంటి సమస్యలకు దారితీస్తుందన్నారు. పిల్లలు కత్తులు, రసాయనాలు, పదునైన వస్తువులు వాడకుండా జాగ్రత్త పడాలని సూచించా రు. కంట్లో నలుసు పడితే పదేపదే రుద్దకూడదన్నా రు. కంటిలో ఏదైనా పడితే నీటితో కడగాలని తెలిపారు. గాయం అయిన వెంటనే సరైన చర్యలు చేపట్టడం ద్వారా దృష్టిని కాపాడుకోవచ్చని సూచించా రు. కార్యక్రమంలో పలువురు కంటి వైద్యులు పాల్గొన్నారు.

సీతాకోక చిలుకల పార్కు పునరుద్ధరణకు చర్యలు



జూ లో పనులు జరుగుతున్న సీతాకోక చిలుకల పార్కు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సీతాకోక చిలుకల పార్కుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఏళ్ల తరబడి జూ అధికారుల నిర్లక్ష్యానికి గురైన ఈ పార్కు పునరుద్ధరణ చర్యలు ప్రస్తుతం జరుగుతున్నాయి. పార్కు నాలుగేళ్లుగా శిథిలావస్థకు చేరడంతో సీతాకోక చిలుకలు మాయమయ్యాయి. దీంతో సందర్శకులకు ఇక్కడ వినోదం, విజ్ఞానం దూరమైంది.

2010లో జూ బయోస్కోప్ సమీపంలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఎదురుగా సుమారు 1000 చదరపు గజాల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేసి, రకరకాల సీతాకోక చిలుకలను ఉత్పత్తి చేశారు. అవి సందర్శకులకు కనువిందు చేసేవి. కాలక్రమంలో పార్కు పైకప్పు కోసం వేసిన ఇనుప మెస్ శిథిలావస్థకు చేరడంతో, ఇందులో సీతాకోక చిలుకలు పైకి ఎగిరిపోయాయి. ఫౌంటెన్ కూడా పని చేయడం లేదు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న ఈ పార్కును జూ అధికారులు పట్టించుకోకపోవడంతో మూతపడింది. దీనిపై ఇటీవల సాక్షిలో వెలువడిన వరుస కథనాలపై అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా పార్కు పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. దీనికి పూర్వ వైభవం తీసుకువచ్చి సందర్శకులకు కొద్ది రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

డాక్టర్ కృష్ణ శ్రీవాత్సవ్‌కు ధన్వంతరి గోల్డ్ మెడల్



డాక్టర్ కృష్ణ శ్రీవాత్సవ్

బీచ్‌రోడ్డు: ప్రముఖ కీళ్ల వైద్య నిపుణుడు, విమ్స్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ తాడికొండ భవానీ ప్రసాద్ కుమారుడు డాక్టర్ కృష్ణ శ్రీవాత్సవ్ ధన్వంతరి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఇటీవల సిరిపురంలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన ఆర్థోపెడిక్ స్టేట్ కాన్ఫరెన్స్‌లో నిర్వాహకులు ఈ మెడల్‌ను ప్రకటించారు. కృష్ణ శ్రీవాత్సవ్ పీజీ విద్యార్థిగా జీఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ విభాగంలో డాక్టర్ ధీరజ్ మణికంఠ కన్సల్టెంట్ స్పైన్ సర్జన్ స్వతంత్ర హాస్పిటల్, విభాగాధిపతి డాక్టర్ వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శాస్త్ర పరిశోధన చేసి, వెయ్యి మందికి పైగా ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్న సదస్సులో సమర్పించారు. ఈ ధన్వంతరి మెడల్‌ను వచ్చే ఏడాది కర్నూల్ లో జరగనున్న ఆర్థోపెడిక్ సదస్సులో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా శ్రీ వాత్సవ్‌ను పలువురు అభినందించారు.

పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించొద్దు



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే దీక్షలో నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని, సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాధరాజు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 128 రోజులుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. సుమారు 40 వేల మంది పోర్టు, డీఎల్‌బీ, సీఐఎస్ఎఫ్, రిటైర్డ్ కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం దారుణమన్నారు. పోర్టు హాస్పిటల్‌ను పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా 300 పడకలతో అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు వారికి ఇవ్వాలనే నిర్ణయం అనైతికమన్నారు. ఇదే జరిగితే సుమారు 40 వేల మంది ఆరోగ్య భద్రత ప్రైవేటు వారి చేతుల్లోకి నెట్టేసినట్టేనన్నారు. పోర్టులో పీపీపీ, బీవోటీ విధానాలు గతంలో విఫలమయ్యాయని, కాగ్ స్వయానా మొట్టికాయలు వేసిందని, అయినా మళ్లీ పీపీపీకి పోర్టు హాస్పిటల్ అప్పగించడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, అధ్యక్షుడు జె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

సీతంపేట : భక్తప్రహ్లాద తెలుగు టాకీ చిత్రం విడుదలైన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రారంభమైంది. భక్తప్రహ్లాద చిత్ర దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి చిత్రపటానికి ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా అభివృద్ధికి దోహదం చేసిన వారిని గుర్తు చేసుకోవడం మన బాధ్యతన్నారు. సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తొలి తెలుగు టాకీ సినిమా నిర్మించిన దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి సేవలను సినీ పరిశ్రమ గుర్తించి తెలుగు సినిమా దినోత్సవాన్ని పండగలా జరపకపోవడం దురదృష్టకరమన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఏటా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తోందన్నారు. అనంతరం 1939లో గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో రూపొందిన రైతుబిడ్డ సినిమాను ప్రదర్శించారు.